క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేటలో శ్రీశ్రీ కోదండ సీతారామ ఆలయ ప్రారంభోత్సవాల్లో భాగంగా రెండో రోజు అయిన శుక్రవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. వేద పారాయణం, పంచగవ్య ప్రాస, విగ్రహ వాస్తు పూజ, హోమం, ధాన్యాధివాసం తదితర పూజలు చేశారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

భూ ఆధార్ చేయించుకోవాలి


భూ ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఏవో మాధురిశరణ్య

కొత్తవలస: సొంతంగా భూమి కలిగి ఉన్న ప్రతీ రైతు భూ ఆధార్ చేయించుకోవాలని ఏవో మాధురిశరణ్య సూచించారు. మండలంలోని ముసిరాం గ్రామంలో చేస్తున్న భూ ఆధార్ నమోదు ప్రక్రియను ఆమె శుక్రవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు కావాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నా భూ ఆధార్ తప్పనిసరి అన్నారు. ఈ నెల 25వ తేదీలోగా భూ ఆధార్ చేయించుకుని, విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని బొండపల్లి, గొట్నంది పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డుమా పీడీ ఎస్.శారదాదేవి శుక్రవారం పరిశీలించారు. పనులను సద్వినియోగం చేసుకోవాలని వేతనదారులకు సూచించారు. రైతులకు ప్రయోజనం కలిగించే పనులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. మట్టిలో నీరు ఇంకిపోయేలా సోక్‌పిట్‌లను నిర్మించాలన్నారు.

పంచాయతీ నిధులతో కాలువల నిర్మాణం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో పంచాయతీ నిధులతో సీసీ కాలువల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. శివాలయం వీధిలో రూ.3లక్షల వ్యయంతో 90 మీటర్ల పొడవున కాలువలు నిర్మిస్తున్నట్టు సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు తెలిపారు.

సంజీవయ్యకు ఘన నివాళి


సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దళిత ముఖ్యమంత్రిగా పని చేసిన దామోదరం సంజీవయ్య జయంతిని జిల్లా జైబీమ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, దళితుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బసవ సూర్యనారాయణ, జి.లక్ష్మణ, ఆర్.రామకృష్ణ, డి.అప్పన్న, ఎస్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం

గజపతినగరం రూరల్: మండలంలోని కాలంరాజుపేటలో అక్రమంగా తరలిస్తున్న 10 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ జె.జనార్ధనరావు శుక్రవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ వ్యక్తిపై కేసు కూడా నమోదు చేశామన్నారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం రవాణా జరిగినా, గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహించినా సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

గంట్యాడ: హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని డీఎంహెచ్‌వో జీవనరాణి సూచించారు. మండలంలోని నరవ గ్రామ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆమె శుక్రవారం సందర్శించి, గర్భిణుల నమోదు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వారు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

బర్డ్‌ఫ్లూపై ఆందోళన వద్దు

గంట్యాడ: బర్డ్‌ఫ్లూ పట్ల ఆందోళన చెందాల్సిన పని లేదని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కోళ్లఫారాల్లో పనిచేసే వారు జ్వరం, ఇతర లక్షణాలు కనిపిస్తే వారికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేయాలని చెప్పారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలతో బాధపడే వారి రక్త నమూనాలను పరీక్షల కోసం పూణే వైరాలజీ ల్యాబ్‌కు పంపిస్తామన్నారు.

చెత్తశుద్ధి ఏదీ?

గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతతో పాటు చెత్త నుంచి ఎరువు తయారు చేసి తద్వారా సంపద సృష్టించడమే లక్ష్యంగా నెలకొల్పిన చెత్త శుద్ధి కేంద్రాలు అస్తవ్యస్తంగా ఉంది. చాలాచోట్ల కేంద్రాల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వం చిన్నచూపు స్పష్టంగా కనిపిస్తోంది. ఏ గ్రామంలోని కేంద్రం చూసినా నిరుపయోగంగానే పడి ఉంది. ఫలితంగా గ్రామాలు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. అవే కేంద్రాలు వినియోగంలోకి వస్తే గ్రామాల్లోని చెత్తను అక్కడికి తరలించి, గ్రామాలు అద్దంలా మెరిసేవని గ్రామస్తులు అంటున్నారు. సంపద సృష్టిస్తా.. వాటితో సంక్షేమ పథకాలు ఇస్తా అని ఎన్నికలప్పుడు ప్రజలను ఊదరగొట్టిన సీఎం చంద్రబాబు చెత్త శుద్ధి కేంద్రాలు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. సంపద సృష్టికి ఇదొక మార్గం కాదా అని నిలదీస్తున్నారు. – లక్కవరపుకోట



నిరుపయోగంగా శ్రీరాంపురం చెత్తశుద్ధి కేంద్రం


శిథిలమైన చందులూరు చెత్తశుద్ధి కేంద్రం


పిచ్చిమొక్కలతో మార్లాపల్లి చెత్తశుద్ధి కేంద్రం


అధ్వానంగా రేగ గ్రామ చెత్త నిర్వహణ కేంద్రం


దొంకలు, ముళ్లపొదలతో లచ్చింపేట చెత్త నిర్వహణ కేంద్రం


అస్తవ్యస్తంగా తామరాపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ


రంగాపురం కేంద్రంలో కానరాని చెత్త నిర్వహణ

మధ్యాహ్న భోజనం తనిఖీ

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో నాగభూషణం శుక్రవారం పరిశీలించారు. తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, రుచి, శుచికరమైన భోజనం విద్యార్థులకు పెట్టాలని తెలిపారు. లెస్సన్ ప్లాన్ ఆధారంగా పాఠ్యాంశాల బోధన చేపట్టాలని, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చూడాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు.


మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈవో నాగభూషణం

అమరవీరులకు ఘననివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

శృంగవరపుకోట: పుల్వామా దాడిలో వీరమరణం పొందిన అమరవీరులకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం నివాళులర్పించారు. అశువులు బాసిన సైనికుల చిత్ర పటాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి, జై జవాన్.. జవాన్ అమర్ రహే.. నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జైషే మహ్మద్ ఉగ్రవాదులు భారత సైనిక వాహన శ్రేణిని టార్గెట్‌గా చేసిన దాడిలో 40 మంది సైనికులు నేలకొరిగారని తెలిపారు. దీనికి ప్రతీకార చర్యగా భారత్ తన వాయుసేనను పాక్ భూభాగంలోకి తీసుకువెళ్లి, బాలాకోట్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మెరుపుదాడి చేయించి, 300 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టిందన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలి


రైతులకు నువ్వు విత్తనాలు అందజేస్తున్న నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి టి.నాగార్జున

- నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి టి.నాగార్జున

లక్కవరపుకోట: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి టి.నాగార్జున సూచించారు. మండలంలోని చందులూరులో శుక్రవారం నిర్వహించిన జై కిసాన్ ఎఫ్‌పీవో వార్షిక సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కాసేపు మాట్లాడారు. రైతుల అభివృద్ధి కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ఉత్పత్తిదారు సంఘాలను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. జైకిసాన్ ఎఫ్‌పీవో సభ్యుల సమష్టి కృషితో రాష్ట్రంలో ఏకైక నువ్వుల ప్రాసెసింగ్ యూనిట్‌ను సాధించుకున్నామన్నారు. వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ పాత్రో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉన్నప్పటికీ సబల సంస్థ ద్వారా ఏర్పాటైన ఎఫ్‌పీవోలు.. చిరుధాన్యాలు, నువ్వుల ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. రైతులంతా ప్రకృతి సేద్యం చేసేందుకు మక్కువ కనబరచాలన్నారు. అనంతరం రైతులకు నువ్వుల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు ప్రవీణ, త్రివేణి, సబల సంస్థ కార్యదర్శి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: పోస్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పోస్టల్ శాఖ సూపరిటెండెంట్ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎరుకమ్మ పేరంటాలు కల్యాణ మండపంలో స్థానిక సబ్ పోస్ట్‌మాస్టర్ హర్ష నేతృత్వంలో పోస్టల్ సిబ్బంది సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఈ నెల 19వ తేదీన జరగబోయే పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటి తలుపు తట్టి పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు తెలియజేయాలన్నారు. సమావేశంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తీర్థమహోత్సవం

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురంలో తీర్థమహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

బొండపల్లి: సొంత భూమి కలిగిన ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఈవో సంతోష్‌కుమార్ సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, వన్-బి కాపీలతో రైతు సేవా కేంద్రాలను ఆశ్రయించి, నమోదు చేసుకోవాలని శుక్రవారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు ప్రక్రియకు అవకాశం ఉందని, రిజిస్టర్ చేసుకున్న రైతులకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇది ఉంటే ప్రభుత్వ రాయితీపై పరికరాలు, విత్తనాలు, ప్రభుత్వ పథకాలు వస్తాయన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి

బొండపల్లి: రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.గిరిబాల సూచించారు. మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. పాడైన తాగునీటి బోర్లను బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరణ చేయాలని తెలిపారు. ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్యల ఉండకూడదని, ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

ఇళ్ల నిర్మాణదారులకు శుభవార్త

గజపతినగరం రూరల్: పోరంబోకు భూముల్లో 2019కి ముందు ఇళ్ల నిర్మాణం చేసుకున్న బీపీఎల్(బిలో పావర్టీ లైన్/దిగువ దారిద్ర్య రేఖ), ఏపీఎల్(ఎబోవ్ పావర్టీ లైన్/ఎగువ దారిద్ర్య రేఖ) వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పిందని తహసీల్దారు బి.రత్నకుమార్ శుక్రవారం తెలిపారు. బీపీఎల్ వారికి మార్కెట్ ధరలో సగం రేటు(డబ్బులు) చెల్లించాలని, అలాగే ఏపీఎల్ వారికి మార్కెట్ ధర ఎంత ఉంటే అంత రేటు చెల్లించాలని పేర్కొందన్నారు. ఆయా లబ్ధిదారులంతా డబ్బుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

విద్యాసామగ్రి వితరణ

శృంగవరపుకోట: మండలంలోని దబ్బగుంట గ్రామంలోని నిరుపేద గిరిజన కుటుంబాలకు చెందిన 25 మంది విద్యార్థులకు కెజియా ఫౌండేషన్ సభ్యులు విద్యాసామగ్రి శుక్రవారం వితరణ చేశారు. ప్లాంకులు, పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నాయుడు, ప్రవీన్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సర్వేలు పూర్తి చేయాలి

వేపాడ: మండలంలోని సోంపేరు, జాకేరు, దబ్బిరాజుపేట గ్రామ సచివాలయాలను ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ శుక్రవారం సందర్శించారు. గ్రామాల్లో చేపడుతున్న సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం హౌస్ హోల్డ్, జియో టాగింగ్, మిస్సింగ్ సిటిజన్స్, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేలు జరుగుతున్న తీరుపై ఆరాతీశారు. సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు సక్రమంగా సేవలందించాలన్నారు.


సోంపురంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



లక్కవరపుకోట మండలంలోని లింగంపేట-కళ్లేపల్లి రహదారిలో లింగంపేట వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తోంది. చేతికి అందినంత ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్, ఎంసీబీ, స్విచ్ ప్యానెల్, వైర్లు ఉండడంతో ఎవరికి ఏ క్షణాన ఏం జరుగుతుందోనని అంతా భయపడుతున్నారు. రోడ్డు మలుపు వద్దనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనదారులు అదుపుతప్పి దానిని ఢీకొంటే పరిస్థితి ఏంటని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వేరేచోటకు ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. – లక్కవరపుకోట

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన



కొత్తవలస తహసీల్దారు కార్యాలయం వద్ద మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని, మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్, వంట సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని, గుర్తింపు కార్డులు అందజేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు బి.నీలకంఠరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. – కొత్తవలస

ఆరు నెలలుగా సేవలు నిల్



లక్కవరపుకోట మేజరు పంచాయతీ సచివాలయంలో పౌరసేవలు నిలిచిపోయాయి. ఆరు నెలల క్రితం ఇక్కడి డిజిటల్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లగా అప్పుడు వీరభద్రపురం డిజిటల్ అసిస్టెంట్‌కు ఇక్కడి బాధ్యతలు అప్పగించారు. ఆయన రోజు తప్పించి రోజు లక్కవరపుకోట వచ్చి, అరకొరగా సేవలందించేవారు. ఇప్పుడు ఆయన కూడా లక్కవరపుకోట వెళ్లలేనని ఎంపీడీవో అప్పారావుకు చెప్పి మరీ మానేశారు. అప్పటి నుంచి రైతుల భూములకు సంబంధించి మ్యుటేషన్లు, అడంగల్‌లో మార్పులు-చేర్పులు, కుల, ఆదాయం, నివాసం ధ్రువపత్రాల మంజూరు వంటి సేవలు పూర్తిగా ఆగిపోయాయి. ఇక్కడి సచివాలయంలో సేవల పరిస్థితులపై జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. – లక్కవరపుకోట

పథకాలు ఇవ్వకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాం..



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇస్తానన్న పథకాలు ఇవ్వకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన గజపతినగరంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు లేనిపోని హామీలతో ప్రజలను బురిడీ కొట్టించి, ఇప్పుడు అమలుచేయలేమని సీఎం చంద్రబాబు చేతులెత్తేయడం మోసమేనన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు అప్పారావు, ఆదినారాయణ, శ్రీను, పాపారావు తదితరులు పాల్గొన్నారు. – గజపతినగరం

భక్తులకు ఇబ్బందులు లేకుండా జాతర ఏర్పాట్లు


సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యవాణి

- కనకమహాలక్ష్మి జాతర సమన్వయ కమిటీ సమావేశంలో ఆర్డీఓ సత్యవాణి
- అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి: ప్రతిష్టాత్మకమైన చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ జి.వి.సత్యవాణి సూచించారు. అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన జాతర సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 2, 3, 4 తేదీల్లో జరగనున్న జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు రక్షిత మంచినీటిని నిరంతరాయంగా సరఫరా చేయాలన్నారు. పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖ, పంచాయతీ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

కనకమహాలక్ష్మి జాతరలో సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎస్.రాఘవులు హెచ్చరించారు. బాణసంచా కాల్చేందుకు ఎస్పీ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. జాతరలో 50 సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని దేవదాయశాఖను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధుల ఫొటోలతో ఫ్లెక్సీలు, ప్రచారాలు నిర్వహించకూడదని చెప్పారు. అయితే, కోడ్ అమల్లో ఉన్నప్పటికీ జాతర సమన్వయ సమావేశానికి టీడీపీ కూటమి నేతలు హాజరుకావడం చర్చనీయాంశమైంది. టీడీపీ మండలాధ్యక్షుడు రౌతు కామునాయుడు, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గవిడి నాగరాజు, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు విజనగిరి శ్రీనివాసరావు వేదికపై కూర్చుని మైక్‌లో మాట్లాడడం కోడ్ ఉల్లంఘనకు రాదా అంటూ పలువురు చర్చించుకున్నారు. కోడ్ ఉల్లంఘించొద్దంటూ చెప్పిన డీఎస్పీ పక్కనే టీడీపీ నాయకులు కూర్చుని ఉండడం గమనార్హం.